క్లుప్తంగా

ఢిల్లీలో ఒగ్గు కళాకారుల ప్రదర్శన



గంగాధర: లాల్ దర్వాజ్ శ్రీసింహ వాహిని మహంకాళి అమ్మవారి దేవస్థానం, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ బోనాల ఉత్సవాల్లో గంగాధర మండలం తాడిజర్రి గ్రామానికి చెందిన మల్లికార్జున ఒగ్గుకళా సేవాసమితి సభ్యులు ప్రదర్శన ఇచ్చారు. ఈసందర్భంగా ఇండియా గేట్ నుంచి తెలంగాణ భవన్ వరకు కళాకారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ సీపీరాధాకృష్ణన్ హాజరయ్యారు. ప్రదర్శనలో ఈర్ల మహిపాల్, గుంట మహేందర్, గణేశ్, గడ్డం రాము, గంగాశంకర్, అజయ్, వంశీ, శ్రీకాంత్, ఆంజనేయులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో జనార్దన్‌రావు



టీచర్లతో మాట్లాడుతున్న డీఈవో

మానకొండూర్: మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, పిల్లల హాజరుశాతం, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల ప్రగతి, భాష, వివిధ అంశాలతోపాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం. మధుసూదనాచారి, హెచ్‌ఎం డి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



ప్లేట్లు పంపిణీ చేస్తున్న తూడి లచ్చన్న

గంగాధర: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి సామాజికవేత్త తూడి లచ్చన్న టీఎల్ యువసేన ఆధ్వర్యంలో నాలుగు వందల ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో జనార్దన్‌రెడ్డి, ఎంఈవో వేణుకుమార్, సాగి అజయ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతను టీచర్లు ఘనంగా సన్మానించారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



లేఖలను చూపుతున్న ఏఐఎస్బీ నాయకులు

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొలుగూరి సూర్యకిరణ్ అన్నారు. ఈమేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అనంతరం మాట్లాడుతూ ఫీజు బకాయిల కోసం లక్షల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారని, విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు నీరటి గౌతమ్, శివకుమార్, అనిల్, సందీప్, నవీన్, అంజి, ప్రశాంత్, వినయ్, రోహిత్, సాయికుమార్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రశ్నించే గొంతులను కాంగ్రెస్ నొక్కుతోంది'

హుజూరాబాద్‌రూరల్ : రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే పోలీసులతో ప్రభుత్వం గొంతునొక్కే ప్రయత్నం చేస్తుందని బీఆర్ఎస్ యూత్ హుజూరాబాద్ నియోజక ఇన్‌చార్జి తొగరు శివకృష్ణ గురువారం ప్రకటనలో ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులపై దాడి సమైక్య పాలనను తలపిస్తుందన్నారు. డీఎస్సీ వాయిదా వేయాలంటూ శాంతియుతంగా నిరసన చేసే నిరుద్యోగులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం తప్పదన్నారు.

'డబుల్' యోగం ఎప్పుడో?

- గన్నేరువరం మండలానికి 140 ఇళ్లు మంజూరు, 2016లో శంకుస్థాపన
- పిల్లర్, స్లాబ్ లెవల్‌లో నిర్మాణాలు



అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం(ఇన్‌సెట్లో) ధ్వంసమైన శిలాఫలకం

గన్నేరువరం: డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మోక్షం కలగడం లేదు. 2016లో మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిర్మాణం ఆలస్యమైంది. మళ్లీ కొద్ది నెలలకే నిర్మాణ పనులు ఆగిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల పథకం ఐదేళ్లుగా ముందుకు సాగడం లేదు. సొంత ఇల్లు లేని నిరుపేదలకు అన్ని హంగులతో కూడిన అధునాతన ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యం ఆమడదూరంలో ఉంది. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గతంలో లబ్ధిదారుల ఎంపిక కోసం పలుమార్లు గ్రామసభలు నిర్వహించినా కొలిక్కి రాలేదు. అధునాతన సదుపాయాలతో ఇళ్లు అందుబాటులోకి వస్తాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్న నిరుపేదలకు నిరాశే మిగిలింది. మానకొండూర్ నియోజకవర్గానికి 2015లో 400 ఇళ్లు మంజూరు కాగా మండలకేంద్రం గన్నేరువరానికి 30 ఇళ్లు కేటాయించారు. అనంతరం మరోదఫాలో గన్నేరువరం, ఖాసీంపేట, పారువెల్ల, మైలారంల్లో 20 ఇళ్లు చొప్పున, జంగపల్లిలో 30 ఇళ్లు కేటాయించారు. మొదటి విడుతలో మండలకేంద్రంతో పాటు జంగపల్లి, ఖాసీంపేట, పారువెల్ల, మాదాపూర్ గ్రామాలను ఎంపిక చేశారు. మండలకేంద్రంలో 50, జంగపల్లిలో 30, ఖాసీంపేట, పారువెల్ల, మైలారం గ్రామాల్లో 20 చొప్పున కేటాయించారు. మండలకేంద్రం మినహా ఏ గ్రామంలో స్థలాలను నిర్ధారించకపోవడంతో జంగపల్లి, ఖాసీంపేట, మైలారం, పారువెల్ల గ్రామాల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. అనువైనా ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం సమస్యగా మారింది. దీంతో ఈ ఐదు గ్రామాల్లోను స్థలాల కొరతతో పాటు లబ్ధిదారుల ఎంపిక చేపట్టలేకపోయారు. చివరికి బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన ముగిసింది. ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇవ్వనున్న డబుల్ బెడ్ రూంల కోసం లబ్ధిదారుల ఎంపిక మండలకేంద్రంలో పూర్తి స్థాయిలో కొలిక్కిరాలేదు. లబ్ధిదారులను గ్రామ సభల్లో ఎంపిక చేయాల్సి ఉంటుంది. దీని కోసం ఇప్పటి వరకు మూడుసార్లు గ్రామసభలు నిర్వహించారు. పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5.4 లక్షలు వెచ్చించాలని ఆ సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం మండలకేంద్రంలో 601 సర్వేనంబర్‌లో 2.1 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. మండలకేంద్రం గన్నేరువరంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి 70 మంది పేదలు దరఖాస్తులు చేస్తున్నారు. ఇందులోంచి అర్హులను ఎంపిక చేయడానికి గతంలో గ్రామసభ నిర్వహించగా ఎంపిక విధానంపై గందరగోళం నెలకొని వాయిదా పడింది. మరో రెండు సార్లు ఏర్పాటు చేసిన ఫలితం లేకుండాపోయింది. ఆనాటి నుంచి వీటి కసరత్తు నిలిచిపోయింది. నిర్మాణ పనులపై ప్రభుత్వం దృష్టి సారించడంతో 2017 మే, జూన్‌లో రెవెన్యూ అధికారులు వచ్చిన 70 దరఖాస్తులపై ఇంటింటికి వెళ్లి విచారణ చేపట్టారు. సొంత ఇళ్లు ఉందా... ఎక్కడ ఉంటున్నారు... కుటుంబంలో ఎంత మంది ఉన్నారు... గతంలో ప్రభుత్వం నుంచి ఇంటి నిర్మాణానికి లబ్ధిపొందారా అని విచారణ పూర్తి చేశారు. కానీపూర్తి స్థాయి జాబితా మాత్రం వెల్లడికాలేదు.

ఈ ప్రభుత్వంలోనైనా...

2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ కొలువుదీరింది. ఈ ప్రభుత్వంలోనైనా ఈ డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేనా అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. కాగా ఎన్నికల సమయంలో ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ తరుణంలో డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తుందా లేక ఎన్నికల హామీలను అమలు చేస్తుందా వేచిచూడాలి. కాగా దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ప్రస్తుతం యథాస్థితి కొనసాగుతోందని తెలిపారు.

కొత్త పైప్‌లైన్లు నిర్మిస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ

చొప్పదండి: పట్టణంలోని అన్ని వార్డుల్లో నూతన పైప్‌లైన్ నిర్మాణం, లీకేజీలకు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పారిశుధ్య వాహనాలకు అత్యవసర మరమ్మతులు, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ, చెడిపోయిన పాత బోర్‌వెల్‌ల స్థానంలో కొత్తవి, మోటార్లు బిగించడం, రక్షిత మంచినీటి సరఫరాలో క్లోరినేషన్, తదితర తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారికి వినతి



జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న బింగి కరుణాకర్

హుజూరాబాద్: జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ గురువారం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా బింగి కరుణాకర్ మాట్లాడుతూ.. కేసీ క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌ను అధికారుల అనుమతి లేకుండా కూల్చివేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ మానకొండూర్ సీఐ అండతో దాడులు



మాట్లాడుతున్న శ్రీహరి

విద్యానగర్(కరీంనగర్): మానకొండూర్ పరిధిలోని అన్నారం గ్రామం రఘువాపూర్ శివారులో తనకు, తన కుటుంబానికి ఉన్న వ్యవసాయ భూమి విషయంలో కోర్టులో కేసు ఉన్నప్పటికీ సీఐ రాజ్‌కుమార్ అండతో ప్రత్యర్థులు తమపై దాడులు చేస్తూ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉత్తమ రైతు అవార్డుగ్రహీత బొప్పు శ్రీహరి ఆరోపించారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు ఉన్న భూమితో పాటు కోర్టు కేసులో ఉన్న 2.30గుంటల భూమిని కాజేయాలనే ఉద్దేశంతో సీఐ అండతో రమణారావు, శ్రీనివాస్‌రావులు తన పంటను నాశనం చేయిస్తూ దాడులు చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నరని తెలిపారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

◆ ఇన్‌చార్జి ఏజీపీగా గుర్రం శ్రీనివాస్‌గౌడ్

హుజూరాబాద్: హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఇన్‌చార్జి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా గుర్రం శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తూ కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. శంకరపట్నం మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ గతంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రెండుసార్లు ఏజీపీగా పనిచేశారు. నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబుకు శ్రీనివాస్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

◆ టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్‌కు సన్మానం

చొప్పదండి: తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన చల్ల నరసింహారెడ్డిని మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలో కార్పొరేషన్ నిధుల ద్వారా చేపట్టిన పనులను పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. చొప్పదండి మున్సిపల్ అభివృద్ధికి సానుకూలంగా స్పందించినందుకు టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ సీఏ ఫలితాల్లో చెల్పూర్ విద్యార్థి సత్తా

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన పబ్బు రవీందర్ చిన్నకుమారుడు శరత్‌చంద్ర గురువారం విడుదలైన సీఏ ఫలితాల్లో సత్తా చాటాడు. ఈ మేరకు మాజీ ఎంపీపీ రాణి, నాయకులు సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నేరేళ్ల మహేందర్‌రెడ్డి, పాలంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పంజాల సదానందం అభినందనలు తెలిపారు.

హామీలు అమలయ్యే వరకు పోరాడాలి



మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

చిగురుమామిడి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఆరునెలలు దాటినప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, హామీలమలయ్యే వరకు ప్రజల పక్షాన ఉద్యమించేందుకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. గురువారం చిమండలకేంద్రంలోని ముస్కురాజిరెడ్డి స్మారకభవనంలో నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో రెండింటిని మాత్రమే సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని, మిగిలినవి అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ బలం తగ్గిపోయిందనడానికి ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలే నిదర్శనమని అన్నారు. సొంతంగా అధికారం చేపట్టేందుకు తగిన బలం లేకపోవడంతో ఇతర పార్టీల భాగస్వామ్యంతోనే నరేంద్రమోదీ మూడోసారి పీఎం అయ్యారని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో గత ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేసిందని, కుటుంబ పాలన వల్ల బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందన్నారు. మండలంలో సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సహాయకార్యదర్శి అందె చిన్నస్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ, ముద్రకోల రాజయ్య, నాయకులు తేరాల సత్యనారాయణ, రాకం అంజవ్వ, ఉస్మాన్‌పాషా, గందె కొంరయ్య, కాత మల్లయ్య పాల్గొన్నారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జన్మదిన వేడుకలు



ఇల్లందకుంటలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

చొప్పదండి: మండలంలో కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను గురువారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. చొప్పదండి పట్టణశాఖ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. గుమ్లాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

గంగాధర: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బీజేపీ నాయకుడు దూళం కళ్యాణ్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఐదు వందల మొక్కలు నాటారు.

రామడుగు: రామడుగు, వెలిచాల గ్రామంలో బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

మానకొండూర్: మండల కేంద్రంలో బీజేపి నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యకర్తలు రక్తదానం చేసిన అనంతరం జీవన్‌దాన్ తెలంగాణ నిమ్స్ హైదరాబాద్ వారితో అవయదానంపై అవగాహన కల్పించారు.

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు సొల్లు అజయ్‌వర్మ గ్రామంలోని కళాకారులకు డప్పులు పంపిణీ చేశారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కట్ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

హుజూరాబాద్: పట్టణంలోని నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఇల్లందకుంట: మండలంలోని నాయకులు ఇల్లందకుంట వృద్ధాశ్రమంలో వృద్ధులతో కేక్ కట్ చేయించారు. కనగర్తి గ్రామంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలో బీజేపీ యువమోర్చా సీనియర్ నాయకుడు మట్ట పవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.

నిరుద్యోగుల ఆందోళనల వెనుక కోచింగ్ సెంటర్ల హస్తం

తాజా మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్

చిగురుమామిడి: డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనల వెనుక కోచింగ్ సెంటర్ యాజమాన్యాల హస్తం ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. గురువారం చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కుట్రపూరిత కార్యక్రమాలు చేయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో కేవలం 5,089 టీచర్ పోస్టులను ప్రకటిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 11 వేల పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఆరునెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, బీఆర్ఎస్ నాయకుల కపట ప్రేమను తెలంగాణ సమాజం గమనిస్తుందన్నారు.

రోడ్డు విస్తరణలో అధికారులతో వాగ్వాదం



జేసీబీతో షాపులను తొలగిస్తున్న అధికారులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న రేకుల షాపులు, టేలాలను గురువారం జేసీబీతో తొలగిస్తుండగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా రేకుల షాపులు, టేలాలను ఏర్పాటు చేశారు. దీంతో ఇటీవల ప్రమాదాలు జరిగాయి. ఈవిషయమై మండలంలోని ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేయగా రెండు నెలల క్రితం అధికారులు వ్యాపారులకు నోటీసులు అందజేశారు. ఎన్నికల సందర్భంగా తొలగింపులో జాప్యం నెలకొంది. రెండు రోజులుగా జేసీబీతో తొలగిస్తుండగా వ్యాపారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గతంలో డ్రైనేజీ నిర్మాణంలో ఓవైపు ఎక్కువ, మరో వైపు తక్కువ విస్తీర్ణంతో నిర్మించారని ప్రజలు ఆరోపించడంతో డ్రైనేజీ వరకు తొలగింపు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ బషీరొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది

జమ్మికుంట: మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి సిబ్బంది, డాక్టర్లు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జనాభా పెరుగుదల వల్ల వచ్చే సవాళ్లు, ప్రభావాలను వివరించారు. అధిక జనాభాతో పలు సమస్యలు వస్తాయని, దేశ ప్రగతి, అభున్నతి జనాభాపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమలో వైద్యులు ఫరహానుద్దీన్, విజయ్‌కుమార్, మహోన్నత, సంధ్యారాణి, కార్తీక్, హిమబిందు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు స్వరూప, రత్నకుమారి, అరుణ, సదానందం, ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, వార్డు కౌన్సిలర్లు

హుజూరాబాద్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక అన్నారు. పట్టణంలోని మున్సిపల్ పార్కులో వన మహోత్సవం పురస్కరించుకొని గురువారం వార్డు కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి వార్డుల్లోని ప్రజలు ఉత్సాహంగా వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సాంబరాజు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వినయ్, అధికారులు తదితరులు ఉన్నారు.

లూజ్ వైర్లను సరిచేసిన విద్యుత్ అధికారులు



విద్యుత్ తీగలను సరిచేస్తున్న విద్యుత్ అధికారులు

జమ్మికుంట: పట్టణంలోని 20వ వార్డులో లూజు వైర్ల సమస్యను గురువారం రూరల్ ఏఈ రమేశ్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు పరిష్కరించారు. టీజీఎన్‌పీడీసీఎల్‌కు లూజ్ వైర్ల సమస్యపై జమ్మికుంట వినియోగదారుల వేదికలో 20 వార్డు కౌన్సిలర్ దేశిని రాధ సదానందం ఫిర్యాదు చేశారు. విద్యుత్ అధికారులు స్పందించి, లూజు వైర్లు ఉన్న స్థలంలో నాలుగు కొత్త విద్యుత్ పోల్స్ వేసి , సమస్య పరిష్కరించారని ఏఈ రమేష్, ఏడీఈ రవీందర్, అధికారులకు వార్డు కౌన్సిలర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు స్వాగతం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

వీణవంక: మండలంలోని ఘన్ముకుల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థులకు స్వాగతం పలుకుతూ గురువారం ఆరంబ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు మహేశ్, శ్రీకాంత్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం



నగదు ఇస్తున్న రామకృష్ణ సేవాసమితి నాయకులు

చొప్పదండి: పట్టణంలోని నిరుపేద కుటుంబానికి చెందిన బుర్ర రాజు మృతి చెందగా దహన సంస్కారాలకు రామకృష్ణ సేవా సమితి సభ్యులు రూ.ఐదు వేలు అందజేశారు. దాతల సాయంతో సేకరించిన మొత్తాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు కొక్కుల కనుకయ్య, సిరిపురం గంగారం, తాళ్లపల్లి గంగయ్య, మేడి శ్రీనివాస్, తదితరులు ఇచ్చారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని సర్వే నంబర్ 629లో ఆరెకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని కాపాడాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు రేణికుంట్ల సాగర్ గురువారం తహసీల్దార్ విజయకు వినితిపత్రం అందజేశారు. ఎందరో పేదలు నివేశన స్థలాల కోసం దరఖాస్తుల చేసుకున్నారని, కబ్జా గురైన భూమి స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. కబ్జా స్థలంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఆందళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, తిరుపతి, మహేందర్ పాల్గొన్నారు.